యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో పాటు ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ రెండు లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాల కల్పనలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 05.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 105 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



## డబుల్ ఇంజిన్ సర్కార్...
# ట్రిపుల్ రీజియన్ ప్రణాళిక

- శ్రమకోర్చి వ్యవస్థలను గాడిన పెడుతున్నాం
- సంక్షేమం- అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తున్నాం
- కేంద్రం అండ లేకుంటే కోలుకోవడం కష్టమయ్యేది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలూ తెలుసుకోవాలి
- విభజన-విధ్వంస నష్టాలు... ప్రభుత్వ చర్యలు... భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా ప్రజెంట్ చేసిన సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : విభజన నాటి కంటే 2019-24 మధ్యన జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నష్టపోయిందని, ఈ సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తన జీవితంలో ఎన్నడూ పడనంత కష్టాన్ని గత రెండేళ్లల్లో పడ్డానని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని మొత్తంగా గాడిలో పెట్టేశామని చెప్పడంలేదన్న సీఎం... రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేలా పోయిన బ్రాండ్‌ను ఎస్టాబ్లిష్ చేశామన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాలు.. ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు ప్రజలకూ తెలియాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్‌లో రెండేళ్ల ఆర్థిక స్థితిగతులపై సీఎం చంద్రబాబు ప్రొగ్రెస్ రిపోర్ట్ ప్రజెంట్ చేశారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు భయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ పాలనపై ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవమే 2024 ఎన్నికల ఫలితాలని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, బ్రాండ్ ఏపీని తిరిగి తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని సీఎం అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. చెప్పిన విధంగా.. ఇచ్చిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. మిగతా 2లో...





# నాన్ ఆక్వా జోన్‌కు రాయితీ విద్యుత్

- యూనిట్ రూ.1.50 చొప్పున ఈ నెల నుంచే అమలు
- ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు
- ఎల్ నినో సంక్షోభ నివారణ ప్రణాళికతో రైతుల వద్దకు

2 లో..



# తీరానికి తాగునీటి భరోసా

- ఉభయ గోదావరి జిల్లాల్లో అమరజీవి జలధార పనులపై ఉప ముఖ్యమంత్రి సమీక్ష
- నీటి ఎద్దడి ప్రాంతాల్లో పనుల వేగం పెంచాలని అధికారులకు ఆదేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా తీరప్రాంత గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 33 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని చెప్పారు.
ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అమలవుతున్న జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై మంగళవారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం తదితర కీలక పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో చర్చించారు.
రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మిగతా 2లో...



## తెలుగుజాతి గర్వించేలా అమరావతి

- మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత
- 2028 నాటికి నిర్మాణాలు పూర్తి
- అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల నివాసాలు
- జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు
- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్న సీఎం చంద్రబాబు

మిగతా 2లో...





## నైతిక విలువలతోనే
# విద్యా వికాసం

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మర్యాదపూర్వక భేటీలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో చాగంటి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం మిగతా 2లో...

# కిరణ్‌కుమార్‌రెడ్డికి రిమాండ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో సిట్ దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసులో ఏ9 నిందితుడిగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని కోర్టు ఈ నెల 18వ తేదీ వరకు రిమాండ్‌కు పంపింది. అనంతరం ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. మద్యం ముడుపుల నగదును షెల్ కంపెనీల ద్వారా తరలించినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి అధికారులు కీలక ఆధారాలను సేకరిస్తున్నట్లు సమాచారం.
2024 నుంచి విదేశాల్లో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి నిన్న శ్రీలంక నుంచి వస్తుండగా అతడిని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సిట్ అధికారులు విచారించి మిగతా 2లో...

## 18 ఏళ్లకే ప్రొఫెసర్..
## 306 ఏళ్ల రికార్డు బద్దలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : పట్టుదల ఉండాలే గానీ.. అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించాడు అమెరికాకు చెందిన నాథన్ థామస్. చాలా మంది 18 ఏళ్ల వయసులో ఉన్నత విద్యలోకి అడుగు పెడుతుంటే.. అతడు మాత్రం తరగతి గదిలో పాఠాలు చెబుతున్నాడు. పదేళ్ల వయసులోనే కళాశాల చదువు ప్రారంభించిన థామస్.. 18 ఏళ్లకే ప్రొఫెసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. మిగతా 3లో...

## స్తంభించిన పార్లమెంటు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : నీట్ అక్రమాలు, అయోధ్య రామాలయ విరాళాల కుంభకోణాలపై పార్లమెంటు ఉభయ సభలు మంగళవారం కూడా స్తంభించాయి. అటు లోక్‌సభ, రాజ్యసభలోనూ.. ఇటు పార్లమెంటు ఆవరణంలోనూ ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్రతిపక్ష సభ్యుల నిరసనహోరు కొనసాగుతుండగానే.. ఎటువంటి చర్చ లేకుండా లోక్‌సభలో రెండు బిల్లులను, రాజ్యసభలో ఒక బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. తొలుత లోకసభను స్పీకరు ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగానే.. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాల హోరెత్తించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు రావాలని, మిగతా 2లో...

# ఉదయనిధి స్టాలిన్ విడుదల



**చెన్నై(జర్నలిస్ట్ ఫైల్)** : నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యల వ్యవహారంలో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ను పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేసిన మద్రాస్ హైకోర్టు .. విచారణ పూర్తయిన వెంటనే నేడే ఆయనను విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో మంగళవారం సాయంత్రం ఉదయనిధిని పోలీసులు విడుదల చేశారు. అసభ్య వ్యాఖ్యల కేసులో డీఎంకే నేతను ఇవాళ ఉదయం చెన్నైలోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.
అరెస్టు అనంతరం ఆయనను తంజావూరుకు తరలించారని విచారణ సందర్భంగా తమిళనాడు అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ మద్రాస్ హైకోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఉదయనిధిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తీసుకోవాలనే ఉద్దేశం పోలీసులకు లేదని.. మిగతా 3లో...

# ఏపీకి కేంద్ర యోగా వరం

- నడింపాలెంలో రూ.100 కోట్లతో సీఆర్ఐవైఎన్ ఏర్పాటుకు కేంద్ర బృందం గ్రీన్ సిగ్నల్
- మూడు నెలల్లో మౌలిక వసతులు పూర్తి..
- 100 పడకల సమగ్ర వైద్య సేవలు అందుబాటులోకి
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం(గుంటూరు దగ్గర్లో)లో 15.03 ఎకరాల్లో రూ. 100 కోట్లతో కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ (సీఆర్ఐవైఎన్) ఏర్పాటు కానుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అధికారిక బృందం మంగళవారం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, ఆమోదం తెలిపిందన్నారు. మూడు నెలల్లో స్థల అభివృద్ధి, రహదారి, కాలువ తదితర మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేసి కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని తెలిపారు. ఈ సంస్థ కార్యకలాపాలు 2028 లో ప్రారంభమవుతాయని తెలిపారు.
**ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో...** : కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని లిలిసెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి (సీసీఆర్‌వైఎన్)లిలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ లిలిసెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి (సీఆర్ఐవైఎన్)లిలి దేశంలో యోగా, ప్రకృతి వైద్య రంగంలో అత్యున్నత పరిశోధనా సంస్థల్లో ఒకటని మంత్రి తెలిపారు. యోగా, ప్రకృతి వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం, మిగతా 2లో...

## వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే
# ముస్తఫా అరెస్టు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కిడ్నాప్ కేసులో గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నాయకుడు షేక్ మహమ్మద్ ముస్తఫాను నూజివీడు పోలీసులు అరెస్టు చేశారు. వ్యాపార వివాదాల నేపథ్యంలో పొగాకు వ్యాపారి కుమారుడితో పాటు మరో ముగ్గురిని మిగతా 3లో...

## నైతిక విలువలతోనే విద్యా వికాసం



(మొదటి పేజీ తరువాయి)

ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను నో బ్యాగ్ డే రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడం పట్ల చాగంటి కోటేశ్వరావు సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటి కోటేశ్వరావు గారిని వినయపూర్వకంగా సాగనంపారు మంత్రి నారా లోకేష్.

## కిరణ్‌కుమార్‌రెడ్డికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఈ నెల 18 వరకు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, షెల్ కంపెనీల పాత్రపై సిట్ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## ఏపీకి కేంద్ర యోగా వరం

(మొదటి పేజీ తరువాయి)

వాటి ప్రభావాన్ని నిర్ధారించడం, వైద్యులు, పరిశోధకులకు శిక్షణ ఇవ్వడం, ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని వివరించారు.

**100 పడకల ప్రత్యేక ఆసుపత్రి :** సంస్థ ప్రాంగణంలోనే 100 పడకల యోగా-ప్రకృతి వైద్య ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. జీవనశైలి వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు యోగా, ప్రకృతి వైద్యంతో సమగ్ర చికిత్స అందించడంతో పాటు పరిశోధన, చికిత్స, శిక్షణ సేవలు ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. అత్యాధునిక పరిశోధనా ప్రయోగశాలలు, ప్రత్యేక చికిత్సా విభాగాలు, శిక్షణా కేంద్రాలు, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఈ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటవుతాయని చెప్పారు.

**ఇప్పటికే... :** దేశంలో ఇప్పటికే హర్యానాలోని జజ్జర్, కర్ణాటకలోని నాగమంగళ, అస్సాంలోని డిబ్రూగఢ్ ప్రాంతాల్లో ఇలాంటి సంస్థలు పనిచేస్తున్నాయని, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, ఒడిశాలోని జట్నీలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంస్థ ఏర్పాటైతే యోగా, ప్రకృతి వైద్య రంగాల్లో పరిశోధన, వైద్య సేవలు, శిక్షణకు రాష్ట్రం జాతీయ స్థాయిలో కీలక కేంద్రంగా ఎదుగుతుందన్నారు.

నడింపాలెంలోని ప్రతిపాదిత స్థలం సంస్థ ఏర్పాటుకు పూర్తిగా అనుకూలమని కేంద్ర బృందం నిర్ధారించిందని మంత్రి తెలిపారు. దీంతో మూడు నెలల్లో స్థలాన్ని చదును చేయడం, రహదారి నిర్మాణం, వర్షపు నీటి కాలువ ఏర్పాటు తదితర మౌలిక వసతుల పనులు పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు.

**స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం :** ప్రతిపాదిత స్థలాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, రాష్ట్ర ఆయుష్ శాఖ సంచాలకులు గోపాలకృష్ణ రోణంకి, కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన మండలి సంచాలకులు డాక్టర్ జ్యోతి కేస్వానీ, కేంద్ర ఆయుష్ శాఖ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమోద్ వర్మ, పరిశోధన అధికారి డాక్టర్ ఎన్.వి. జ్ఞానదీప్ తాటవర్తితో కలిసి పరిశీలించారు. స్థలం సరిహద్దుల వెంట వర్షపు నీరు ప్రవహిస్తున్నందున మూతలతో కూడిన సిమెంట్ కాలువ నిర్మించాలని నిర్ణయించారు. జాతీయ రహదారి-16 నుంచి ప్రభుత్వ భూమి మీదుగా 40 అడుగుల వెడల్పుతో ప్రత్యేక రహదారి నిర్మించాలని సూచించారు. జాతీయ రహదారి కంటే దిగువన ఉన్న ప్రాంతాలను మట్టితో నింపి చదును చేయడంతో పాటు, ప్రజా రవాణా సౌకర్యం కోసం సమీపంలో బస్‌స్టాప్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ రహదారి-16కు ఆనుకుని, గుంటూరు నగరానికి అత్యంత సమీపంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రధాన అనుకూలతగా అధికారులు పేర్కొన్నారు.

## స్తంభించిన పార్లమెంటు



(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రాప్రియేషన్ బిల్లు-2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. దీంతో వెంటనే సభలో చర్చకు రాగా.. ప్రతిపక్ష సభ్యులు ఇరు బిల్లులనూ వ్యతిరేకించారు. కానీ.. చివరకు మూజు వాణి ఓటుతో రెండు బిల్లులూ ఆమోదం పొందాయి. ఆ వెంటనే సభను నేటికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. సభను ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రారంభించగా, జీరో అవర్ నిర్వహించేందుకు సిద్ధపడ్డారు. ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో జనన, మరణ నమోదు సవరణ బిల్లుపై చర్చ జరిగింది. ఈ బిల్లును కూడా మూజువాణి ఓటుతోనే ఆమోదించుకున్నారు. అనంతరం సభను బుధవారం నాటికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. అయోధ్య ట్రస్ట్, విద్యార్థుల నిరసనలపై ఉభయ సభల్లో చర్చ జరపాలని కోరారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో రామజన్మ భూమి ట్రస్ట్, విద్యార్థులపై జరిగిన అఘాయిత్యాల వంటి అంశాలపై చర్చకు అనుమతించాలని ఉభయ సభల స్పీకర్లను కోరారు. 'రామ జన్మభూమి ట్రస్ట్ గురించైనా, విద్యార్థులపై జరుగుతున్న అన్యాయం, అఘాయిత్యాల గురించైనా సరే, మేము కోరుతున్నదంతా చర్చ జరగడమే. వారు ఎందుకంత సంకోచిస్తున్నారో మాకు అర్థం కావడం లేదు' అని ఆయన అన్నారు

# డబుల్ ఇంజిన్ సర్కార్... ట్రిపుల్ రీజియన్ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)



అందుకే పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, కొత్త రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని.. ఆ మేరకు కొత్త పాలసీలు తెస్తుందని సీఎం వివరించారు.

**సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలు సహకరిస్తారు :** ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే ప్రజలు కూడా అభివృద్ధిలో ఏ స్థాయిలో భాగస్వాములు అవుతారో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చాటిచెప్పిందని ముఖ్యమంత్రి అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెక్కలు వచ్చిన భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. ఉత్తరాంధ్రను అంతర్జాతీయ అవకాశాలకు గేట్‌వేగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజలు గ్రహించారు కాబట్టే... ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి చక్కటి మద్దతు లభించిందని ముఖ్యమంత్రి అన్నారు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులు చేపడుతుంటే వ్యతిరేకించిన వారు... అదే పీపీపీ పద్ధతిలో చేపట్టిన భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ క్రెడిట్ మాత్రం తమదని చెప్పుకుంటున్నారని సీఎం విమర్శించారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు వస్తాయని.. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయని.. ఆదాయం పెరిగితే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**గుంతల రోడ్లు.. గుదిబండ అప్పులు :** 2019-24 మధ్య రాష్ట్రాన్ని విషవలయంలోకి నెట్టారని... రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు అభివృద్ధి వేగాన్ని నిలిపివేశారని అన్నారు. ఆదాయాలు తగ్గి.. ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో అప్పులు పెంచుకుంటూ వెళ్లారని, చివరకు రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2019లో పరిపాలన ప్రారంభించిన తీరు ప్రజా వేదిక కూల్చివేతతోనే స్పష్టమైందని పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ప్రజా వేదికను కూల్చారు. దీన్ని గర్వం అనాలా..? మదం అనాలా..? దీనికి పేరే లేదేమో..? అని సీఎం ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో విధానపరమైన నిర్ణయాల కంటే విధ్వంసకర చర్యలకే గత ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వెనక్కి నెట్టారని సీఎం అన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో పురోగతి ఆగిపోయిందని, రోడ్ల నిర్వహణ సరిగాలేక గుంతలమయంగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి దెబ్బతినడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గిందన్నారు. పరిశ్రమలు రావాల్సిన చోట ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని, కొత్త పెట్టుబడులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం తీవ్రంగా దిగజార్చిందని చంద్రబాబు విమర్శించారు. నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులు రూ. 9.74 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు తీర్చే సామర్థ్యం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ పేర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదాయాలు తగ్గుతున్నా ఖర్చులు మాత్రం పెరిగాయని, ప్రభుత్వ ఆస్తులు, భూములను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రం దివాళా తీసే స్థాయికి చేరడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

**కేంద్ర నిధులూ దారి మళ్లించారు :** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన పథకాల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని సీఎం ఆరోపించారు. కేంద్ర నిధుల వినియోగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగా కేంద్రం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి ప్రభుత్వం... చివరకు మద్యం ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి రూ. 25 వేలకోట్లు అప్పులు తెచ్చిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీకి పూర్తి భిన్నంగా మద్యం ఆదాయాన్ని ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు ఉపయోగించారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకంగా మారిందని సీఎం తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుందని వ్యాఖ్యానించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని చెప్పారు. కేంద్రం సాయం అందిస్తే దాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధిగా మలచుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు ఇచ్చిన ఓట్లతోనే ఇదంతా చేయగలుగుతున్నామని చంద్రబాబు అన్నారు.

**ఆర్థిక వ్యవస్థను అడవి పందుల్లా ధ్వంసం చేశారు :** అడవి పందులు పంటను నాశనం చేసినట్టుగా... నాటి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చిన రెవెన్యూ లోటు నిధులను కూడా ముందుగానే ఖర్చు చేశారని అన్నారు. ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో ఆగకుండా.. రాష్ట్ర భవిష్యత్తును మార్చే అనేక కీలక ప్రాజెక్టులను కూడా విధ్వంసం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి నగర నిర్మాణాన్ని నిలిపివేశారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్-1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సీఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ. 37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఏపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని... ట్రిపుల్ రీజియన్ ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రంగా ఎకనమిక్ రీజియన్ల వారీగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.

**టెక్నాలజీని అడ్డుకోవద్దు :** గతంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఇప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. ISA ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని వెల్లడించారు. డేటా సెంటర్లు వస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాకెందుకు స్టీల్ ప్లాంట్.. మాకెందుకు ఏఐ.. మాకెందుకు డేటా సెంటర్లు అంటూ పేదరికంలోనే బాధపడాలా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఆదాయం, రాష్ట్రానికి సంపద తీసుకొచ్చే పరిశ్రమలు, సాంకేతిక రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా పబ్లిక్ పాలసీలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం ఎంత ముఖ్యమో.. అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మంచి రోడ్లు వేయాలన్నా.. మౌలిక వసతులు కల్పించాలన్నా.. సంపద సృష్టించాల్సిందేనని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించడంతోపాటు.. పెట్టుబడులను ఆకర్షించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షించారు. పరిశ్రమలు వస్తే ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందో కియా కార్ల పరిశ్రమను ఉదాహరణగా సీఎం ప్రస్తావించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం వల్లే ప్రజలు ప్రభుత్వాన్ని నమ్ముతున్నారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాన్ ఆక్వా జోన్‌కు రాయితీ విద్యుత్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల నుంచే నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న ఆక్వా రైతులకూ రాయితీపై విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్వా జోన్ పరిధిలో ఇస్తున్నట్లే నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులకూ యూనిట్ విద్యుత్‌ను రూ. 1.5కే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ నెల నుంచి దీనిని అమలు చేయాల్సిందిగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఇక జోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఆక్వా రైతులందరికీ రాయితీ విద్యుత్ అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయంతో 12,500 మంది ఆక్వా రైతులకు లబ్ది కలగనుంది. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం, పంటల సాగు, జల వనరులు తదితర అంశాలపై వ్యవసాయ శాఖతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో సంక్షోభ నివారణ ప్రణాళికతో రాష్ట్రంలోని ప్రతీ రైతు వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రైతులు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళికల్ని వారికి వివరించాలని సూచించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి రైతులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఎల్ నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అక్టోబర్ మాసం వరకూ లోటు వం-ర్షపాతం నమోదయ్యే సూచనలున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అనుసరించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ప్రత్యేకించి



పీఎండీఎస్ విధానంలో సాగు చేసేందుకు ఉన్న అవకాశాలను రైతులకు వివరించేలా రైతుల వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎల్ నినో లాంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్పష్టమైన విధానాన్ని రైతులకు అందించాలని అన్నారు. రైతు యాప్ ద్వారా పూర్తి సమాచారాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు వేగంగా అందించాలని స్పష్టం చేశారు. వర్షపాతం తగ్గి, సాగు విస్తీర్ణం పెరుగుతోందని క్షేత్రస్థాయిలో వస్తున్న ఈ మార్పులకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్ నినో ఎఫెక్ట్ మిటిగేషన్ యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పశువుల దాణా విషయంలోనూ వీబీ జీ రామ్ జీ అనుసంధానించాలన్నారు.

**ఆఫ్ స్టైల్ పొగాకు రైతును ఆదుకునేందుకు రూ.94 కోట్లు :** ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ. 10 మద్దతు ధర ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేపటి నుంచే ఇది అమల్లోకి రావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. 94 మిలియన్ కేజీల ఆఫ్ స్టైల్ పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా 44 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు, రైతులు సహా 5గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించాలని సీఎం నిర్దేశించారు. అలాగే ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు ప్రస్తుతం 48.27 మిలియన్ కేజీల కొనుగోళ్లు జరిగాయని అధికారులు వివరించారు. రైతులను ఆదుకునేలా బ్యారెల్ కు రూ. 50 వేల రుణం ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఆక్వా సంక్షోభాన్ని నివారించేలా రొయ్య మేత ధరల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి తగ్గించేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం నిర్ణయం తీసుకునేంత వరకూ రొయ్యమేత ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమను ఉద్యాన హబ్ గా తీర్చిదిద్దే అంశంపై వేగంగా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే 201 ఉద్యాన క్లస్టర్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇక నుంచి ప్రతీ మంగళవారం వ్యవసాయం, అనుబంధ రంగాలపై, ఎల్ నినో ప్రభావం నియంత్రణా చర్యలపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, జల వనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తీరానికి తాగునీటి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్, నిర్ణీత గడువులోపు అన్ని నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ మిషన్ పనుల వేగాన్ని మరింత పెంచాలని సూచించారు.

**తూర్పు గోదావరిలో రూ.1,650 కోట్ల మెగా వాటర్ గ్రిడ్ :** సమీక్షలో అధికారులు పనుల పురోగతిని వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ. 1,650 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం ద్వారా 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణం కొనసాగుతోందన్నారు. 111 ఎంఎల్‌డీ, 75 ఎంఎల్‌డీ సామర్థ్యాలతో ఏర్పాటు చేస్తున్న రెండు నీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి నిర్మాణ దశలో ఉందని వివరించారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు రూ. 151 కోట్లకు పైగా వ్యయం చేయగా, 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**పశ్చిమ గోదావరిలో 13.5 లక్షల మందికి ప్రయోజనం :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రూ. 1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.



ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రం నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. రెండు ప్రాజెక్టుల కింద కలిపి సుమారు 400 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు.

**శాఖల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి :** గత ఏడాది డిసెంబరులో పశ్చిమ గోదావరి జిల్లా పెరవలిలో రూ. 3,050 కోట్ల అంచనా వ్యయంతో అమరజీవి జలధార ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం వంటి కీలక పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కేటాయింపులు పూర్తయి నత్తనడకన సాగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్‌లో ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, పంచాయతీరాజ్ శాఖ, అవసరమైన చోట అటవీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

**నాణ్యతలో రాజీ వద్దు :** జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ల ద్వారా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి రాష్ట్ర కార్యాలయానికి నివేదికలు పంపాలని పవన్ కల్యాణ్ సూచించారు. ముఖ్యంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీరప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ కింద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## తెలుగుజాతి గర్వించేలా అమరావతి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేశ్ తో ఆయనకేంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై మంత్రులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న ఉన్నత విద్యా వంతుడితో మంత్రి నారా లోకేశ్ తో ఆయనకు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా..? అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు పలికారు.

**2028 నాటికి అమరావతి సిద్ధం : మంత్రి సవిత**

తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబునాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు.

**జగన్ ది విధ్వంసం... మాది అభివృద్ధి... :** ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని , తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్‌ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు. నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం:

## ఎమ్మెల్సీ ఆలపాటి





తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడూ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్సీ, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

టీడీపీ చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మారీసుపేట రావి రవీంద్రనాథ్ కాలనీతో పాటు 23, 24వ వార్డుల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

అనంతరం ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం 94 సంక్షేమ పథకాలను రద్దు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 85 కొత్త సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

ప్రతి పేద కుటుంబంలో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 'తల్లికి వందనం', సామాజిక భద్రతా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో పాటు ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ రెండు లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాల కల్పనలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని చెప్పారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# 18 ఏళ్లకే ప్రొఫెసర్.. 306 ఏళ్ల రికార్డు బద్దలు



(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన పురుష ప్రొఫెసర్ గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు.

ఈ విషయంలో దాదాపు 300 ఏళ్ల నాటి రికార్డును థామస్ బద్దలు కొట్టాడు. అంతకుముందు 1717లో స్కాట్లాండ్ గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్‌లారిన్ తన 19 ఏళ్ల వయస్సులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రికార్డును తాజాగా థామస్ అధిగమించాడు. అమెరికాలోని మియామీ కాలేజీలో ఇంజినీరింగ్ అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టిన థామస్ తనతో దాదాపు సమానమైన వయసున్న విద్యార్థులకు బోధిస్తుండటం విశేషం.

నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే dual ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం కింద మియామీ కాలేజీలో చేరాడు. అనంతరం 14 ఏళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతో పాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్‌లో డిగ్రీ చదువుతున్న నాథన్.. న్యాయ నిపుణుడు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

# వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

కిడ్నాప్ చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌లపై పోలీసులు కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా ముస్తఫా ఆయన కుమారుడు తప్పించుకు తిరుగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడి కోసం గాలిస్తున్న పోలీసులు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుజరాత్‌లో పట్టుకున్నారు.

అసలేం జరిగిందంటే?: మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు గుంటూరులో పొగాకు గోదాము ఉంది. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన కడిమి సూర్యచంద్రం రైతుల నుంచి పొగాకును సేకరించి, గుంటూరులోని ముస్తఫాకు విక్రయించేవారు. అయితే, ఇటీవల ముస్తఫా కొనుగోలు ధరను భారీగా తగ్గించారు. ఆ ధరలకు వ్యాపారం గిట్టుబాటు కావడం లేదంటూ సూర్యచంద్రం తన సరుకును ముస్తఫాకు అమ్మడం ఆపేసి, గుంటూరులోని మరో కంపెనీకి అమ్మడం మొదలుపెట్టారు. సూర్యచంద్రం కుమారుడు అభి డ్రైవర్ బాలరాజు, గుమస్తా దుర్గారావుతో కలిసి సోమవారం రాత్రి పొగాకు బేళ్లను సొంత వాహనంలో లోడ్ చేసుకొని కొయ్యలగూడెం నుంచి గుంటూరుకు బయలుదేరారు. కాసేపటికే అభి ఏడుస్తూ తన తండ్రికి ఫోన్ చేశారు.

"మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడు బషీర్, అతని అనుచరులు రెండు కార్లలో వచ్చి నూజివీడు వద్ద మమ్మల్ని అడ్డగించారు. వారు పొగాకు బేళ్లతో సహా వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మమ్మల్ని కిడ్నాప్ చేసి తీసుకెళు న్నారు. వాళ్లకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లిస్తేనే మమ్మల్ని వదిలేస్తామని అంటున్నారు" అని చెప్పి అతను ఫోన్ పెట్టేశాడు. సూర్యచంద్రం వెంటనే మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు ఫోన్ చేశారు. "మాకివ్వాల్సిన డబ్బులు తీసుకుని వెంటనే గుంటూరులో పొగాకు గోదాముకు రండి. లేదంటే నీ కొడుకును మళ్లీ చూడలేరు" అని ముస్తఫా హెచ్చరించారు. ఆందోళనకు గురైన సూర్యచంద్రం పోలీసులకు సమాచారం అందించారు.

బాకీ ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోండి: ముస్తఫా పొగాకు గోదాములు గుంటూరు జిల్లా పెదకాకానిలో ఉన్నందున బాధితులను అక్కడే బంధించి ఉంటారన్న అంచనాతో నూజివీడు పోలీసులు అక్కడి స్టేషన్ సిబ్బందికి సమాచారమిచ్చారు. పోలీసులు వెంటనే ముస్తఫాకు ఫోన్ చేసి "సూర్యచంద్రం మీకు డబ్బులివ్వాల్సి ఉంటే చట్టపరంగా తేల్చుకోండి. అంతేకానీ, అతని కుమారుడిని కిడ్నాప్ చేయడం తగదు. వెంటనే వారితో పాటు మీ అబ్బాయిని స్టేషన్‌లో లొంగిపోయేలా చూసుకోండి" అని స్పష్టం చేశారు. మంగళవారం తెల్లవారుజామున బాధితులను వెంటబెట్టుకొని వచ్చిన కిడ్నాపర్ల ముఠా, పెదకాకాని పోలీస్ స్టేషన్?లో లొంగిపోయింది. అయితే, ముస్తఫా, బషీర్ అప్పటినుంచి పరారీలో ఉన్నారు.

# ఘనంగా మండలి వెంకటకృష్ణారావు శత జయంతి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, తెలుగు భాషా సంస్కృతి పరిరక్షకుడు, మాజీ విద్యాశాఖ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఘనంగా నివాళులు అర్పించారు.

మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్ణయించింది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వెంకటకృష్ణారావు జీవిత విశేషాలు, విద్యా రంగానికి, తెలుగు భాషాభివృద్ధికి, సామాజిక సేవకు ఆయన చేసిన విశిష్ట సేవలను వివరించారు. యువతలో సేవా భావం, దేశభక్తి, తెలుగు భాష పట్ల గౌరవాన్ని పెంపొందించేలా వ్యవహరించారని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు ఆశయాలను భావితరాలకు చేరవేయడం, ఆయన చేసిన సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుల్లో ఒకరని, ఆయన రాజకీయవేత్త, గాంధేయవాది, సంఘసేవకుడు, విద్యా--సాంస్కృతిక పరిరక్షకుడుగా సేవలు అందించారని అన్నారు. ప్రజాసేవను జీవిత ధ్యేయంగా తీసుకొని నిరాడంబర జీవనం గడిపిన ఆయనను "దివిసీమ గాంధీ" అని గౌరవంగా పిలవడం, ఆయన పట్ల ప్రజలకు గల గౌరవం తెలియజేస్తుందన్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దివిసీమ ప్రాంత అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. 2026లో ఆయన శత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుటకు నిర్ణయించడం ముదావహం అన్నారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి రమ్య, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, స్టెప్ సి.ఇ.ఓ పి.వి.ఎన్.సత్యనారాయణ, మాజీ ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డి. సుబ్రహ్మణ్యం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. మాణిక్యాలరావు, సీనియర్ సిటిజన్ మాధా రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలి



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ): ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. కాకుమాను మండలంలోని కొమ్మూరు , గార్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి పంట వేయకుండా తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్క రైతు సేవా కేంద్రంలో ఉన్నాయన్నారు . మినుము పంటకు పసల బీమా యోజన క్రింద ఎకరాకు 200/-కట్టుకోవచ్చని రైతులు తెలియజేశారు. ఈ అవకాశం ఆగస్టు 15,వ తేదీ వరకు ఉందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో సాగు పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘనజీవామృతం దవజీవామృతం బీజామృతం వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం సురేష్ మాట్లాడుతూ పంట పొలాల్లోనే కాకుండా ఇంటి మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ పథకాలు పశువులకు వచ్చే కొన్ని వ్యాధుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ జరీనా, పవన్ ఏపీ సీఎం అఫ్ స్టాఫ మరియు రైతులు పాల్గొన్నారు.

# జీఎంసీ ఖాళీ స్థలాల్లో స్పోర్ట్స్ థీమ్ పార్కులు

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వినియోగంలో లేని ఖాళీ స్థలాలను పిల్లల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఉద్యోగనగర్, వేణుగోపాల్ నగర్, మధురా నగర్, బాపయ్య నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లోని జీఎంసీ స్థలాలను మంగళవారం పరిశీలించిన ఆయన, ఆయా స్థలాల అభివృద్ధికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం పిల్లలు డిజిటల్ పరికరాలకే ఎక్కువగా పరిమితమవుతున్న నేపథ్యంలో, వారి శారీరక దారుఢ్యం, మానసిక వికాసానికి ఆట స్థలాలు అత్యవసరమని కమిషనర్ పేర్కొన్నారు. పిల్లలు



వివిధ క్రీడల్లో ఆసక్తి పెంచుకునేలా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధునిక సౌకర్యాలతో పార్కులను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఒక్కో పార్కును ఒక్కో ప్రత్యేక థీమ్‌తో రూపొందించి అన్నివర్గాల ప్రజలకు ఆకర్షణీయంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

ఇప్పటికే అభివృద్ధికి అనువైన స్థలాల గుర్తింపు పూర్తయిందని, ఆక్రమణలు ఉన్న చోట వాటిని తొలగించి సరిహద్దులు నిర్ధారించి ఇంజినీరింగ్ శాఖకు అప్పగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నివాసాలకు దూరంగా ఉన్న ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటి, జీఎంసీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ వేణుగోపాల్, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ శ్రీనివాస్‌తో పాటు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎల్ఐసీలో ప్రభుత్వ వాటాల విక్రయం నిలిపివేయాలి: సీఐటీయూ

- **బీమా ఉద్యోగుల ఆందోళనకు మద్దతు ప్రకటించిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ**

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో కేంద్ర ప్రభుత్వం మరో 6.5 శాతం వాటాలను విక్రయించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం దేశ స్వావలంబనకు, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి విరుద్ధమని పేర్కొంది. బుధవారం బీమా ఉద్యోగులు చేపట్టనున్న ఆందోళనలకు పూర్తి మద్దతు ప్రకటించింది.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఎ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ, కోట్లాది పాలసీదారుల నమ్మకం, పొదుపుతో ఎదిగిన ఎల్ఐసీ దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక అవసరాలకు లక్షల కోట్ల రూపాయల నిధులు సమకూర్చిన సంస్థ అని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 3.5 శాతం వాటాలను విక్రయించిందని, ఇప్పుడు మరో 6.5 శాతం వాటాల విక్రయం చేపట్టడం ప్రజా రంగాన్ని బలహీనపరిచే చర్య అని విమర్శించారు.

1956లో ప్రభుత్వం పెట్టిన రూ.5 కోట్ల పెట్టుబడికి గత ఆర్థిక సంవత్సరంలోనే ఎల్ఐసీ రూ.12,200 కోట్ల డివిడెండ్ చెల్లించిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా సమకూరిన ఆదాయంతో పోలిస్తే ఎల్ఐసీ ప్రాధాన్యం స్పష్టమవుతుందని తెలిపారు.

ద్రవ్యలోటును పూడ్చే పేరుతో లాభదాయకమైన ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలు విక్రయించడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధమని, ఇది దేశ ఆర్థిక బలాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం, దేశీయ పొదుపులను పెంచడం, నాణ్యమైన ఉపాధి అవకాశాలను సృష్టించే ప్రత్యామ్నాయ విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

# ఉదయనిధి స్టాలిన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

కేవలం విచారించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రశ్నించడం పూర్తయిన వెంటనే ఆయనను విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చింది.

కావేరీ జల వివాదంపై సోమవారం ఉదయనిధి మాట్లాడుతూ.. టీవీకే ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన నటి గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అనంతరం తాను చెప్పింది కావేరీ గురించేనని వివరణ ఇచ్చారు. ఇది కాస్తా రాజకీయ దుమారానికి దారితీసింది. మహిళలను కించపర్చేలా ఉదయనిధి మాట్లాడారని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మరోవైపు.. డీఎంకే నేత వ్యాఖ్యలపై టీవీకే పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఉదయనిధిపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే ఆయన బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకోగా.. న్యాయస్థానం అత్యవసరంగా విచారణ జరిపి ఆదేశాలిచ్చింది.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. వినతులన్నింటినీ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# ప్రభుత్వ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్షా సమావేశం

- మదనపురం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి..
- నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి...
- వీబీజిరామ్‌జీ పనులపై అధికారులు నూతన సర్పంచ్‌లకు అవగాహనా కల్పించాలి...





**దేవరకద్ర, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గం,మదనపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు, అనంతరం ఎమ్మెల్యే జిమ్మెర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయంతో పని చేయాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలి. అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. మరి ముఖ్యంగా రెవెన్యూ శాఖ భూ సమస్యలపై ప్రజల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎంతగానో మెరుగుపరిచింది, మెరుగైన మౌలిక వసతులు కల్పించింది.తద్వారా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగాయి. ఉపాధి హామీ పథకం కు సంబంధించి, వీబీజి-రామ్ - జీ పనులపై అధికారులు నూతన సర్పంచ్ లకు అవగాహన కల్పించాలి. సర్పంచ్ లతో చర్చించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి, రాబోయే వర్షాకాల సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, అన్ని రకాల మెడిసిన్ (డ్రగ్స్)ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి, త్వరలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్, ఏబీ స్విచ్లు, పోల్స్ తదితర విద్యుత్ ఉపకరణాలు వస్తున్నాయి మండలాల వారిగా కార్యక్రమాలు నిర్వహించి అందజేస్తాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి. రోడ్లు, భవనాల నిర్మాణ పనులను, నిర్ణీత గడువులో పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలి. ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి. విద్య, వైద్యం, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టి మన ప్రభుత్వం పని చేస్తుంది. మదనపురం మండలంలో 90% ఇండ్లకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నం. గత ప్రభుత్వం మదనపురం మండలంలోని సరళసాగర్, నెల్విడి, కూరుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలే, మన ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మత్తుల కోసం 5 కోట్లు మంజూరు చేసింది. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే జియంఆర్ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, మండల సర్పంచులు ,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానంలో జిల్లాకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి...
- గ్రామ స్థాయిలో గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన




**దేవరకద్ర ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ,మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు,జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ,నాణ్యనతతో రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానంలో జిల్లాకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్--2026ను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి శాఖపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ, మండల పంచాయతీ, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల సమన్వయంతో రూపొందించాలని తెలిపారు. ఈ ప్రణాళికల్లో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితర భాగస్వాములందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. జిల్లా, మండల స్థాయిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు గ్రామ స్థాయిలో గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, మహిళా మరియు శిశు సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న నిధులు, చేపట్టే కార్యకలాపాల వివరాలను డేటా కలెక్షన్ ఫార్మాట్ల ద్వారా గ్రామ, మండల స్థాయి అధికారులకు అందించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు గ్రామసభలు, మండలసభల్లో తప్పనిసరిగా పాల్గొని నాణ్యమైన ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులందరూ తమ పరిధిలోని మండల, గ్రామ స్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈసారి గ్రామాభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానం అమల్లో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీలు రూపొందించే ప్రణాళికలు ఏ, బి, సి, డి గ్రేడ్లలో ఏ స్థాయిలో ఉన్నాయో ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని శాఖల కార్యక్రమాలు, పథకాలు, నిధులు, కార్యకలాపాలు సమగ్రంగా ప్రణాళికల్లో పొందుపరిస్తేనే అత్యుత్తమ గ్రేడ్ సాధించవచ్చన్నారు. శాఖల వారీగా అమలు చేస్తున్న పథకాల కార్యనిర్వహణ, నిధుల విడుదల, చెల్లింపులు, అమలు ప్రక్రియలో ఎలాంటి మార్పు ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా శాఖల కార్యాచరణ యథావిధిగా కొనసాగుతుందని, గ్రామాభివృద్ధి ప్రణాళికలో కేవలం సమగ్ర సమాచారాన్ని పొందుపరచడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని తెలిపారు. ఈ విషయాన్ని అన్ని స్థాయి అధికారులకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ.నిర్మల, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ. ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# నెక్కొండలో పెద్ది విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెట్టాలి....
- దేవాదుల పథకానికి పెద్ది పేరు నిర్ణయించాలి అమెరికాలో ఎన్నారైల అల్టిమేటం





**నర్సంపేట, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వర్గీయ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ఉద్యమకారుడు టీఆర్ఎస్ పార్టీ ప్రముఖ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో యావత్ నర్సంపేట డివిజన్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా తో పాటు తెలంగాణ రాష్ట్రం శోకసంద్రంలో మునిగిపోయింది. 15 గంటల అంతిమయాత్ర లో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతూ ఉద్యమం అంటే నీది మనిషివంటే నీవే నీలాగే బతకడానికి ప్రయత్నం చేస్తాం పెద్దన్న అంటూ భావోద్వేగంలో ఆవేదన చెందారు . తెలంగాణ రాష్ట్రంతో పాటు అమెరికా ఇంగ్లాండ్ లాంటి దేశాలలో సైతం స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులర్పించారు. దాంతోపాటు వరంగల్ జిల్లా కేంద్రంలో ఉండాల్సిన మెడికల్ కాలేజీ, జిల్లా స్థాయి ఆసుపత్రిని నర్సంపేటకు తీసుకువచ్చిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డికే ఉన్నందున మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరుతో నిర్వహించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులతో పాటు ప్రజాసంఘాల నాయకులు ఫ్లెక్సీలు పెట్టి డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అమెరికాకు చెందిన తెలంగాణ ఎన్నారైలు నర్సంపేట డివిజన్లో కృష్ణ డెల్టా లో ఉన్న పాకాల సరస్కు అత్యంత చాకచక్యంగా ప్రత్యేక డిపిఆర్ ను ఏర్పాటు చేసి గోదావరి జిల్లాలను కృష్ణమ్మ చెంతకు చేర్చిన పెద్ది సుదర్శన్ రెడ్డి మేధస్సు అమోఘమని ఏ ఒక్క ఎకరం మునగకుండా ఏ ఊరు మునగ కుండా 50వేల ఎకరాలకు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు దేవాదుల ఎత్తిపోతల నీటి పథకానికి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును పెట్టాలని అలా కానిపక్షంలో రాబోవు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గెలిపించి పేరు మార్పిడి చేయాల్సివస్తుందని వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.

**విగ్రహానికి స్థలం కేటాయించండి**
**- కలెక్టర్‌ను కోరిన నెక్కొండ నాయకులు**

జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, స్టేట్ మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ సూరం రాజిరెడ్డి, జిల్లా కో-ఆప్షన్ మాజీ సభ్యులు అబ్దుల్ నబీ, సోషల్ మీడియా కన్వీనర్ మాతంగి రాజు, సిరిపోతుల సురేష్, వడ్డే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం..

- చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..
- విద్యార్థులకు సూచనలు చేసిన టౌన్ సిఐ భాస్కర్..




**యాదగిరిగుట్ట, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరి గుట్ట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం, బాలల హక్కులు, రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ భాస్కర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మన శరీరాన్ని, మనసును, కుటుంబాన్ని, భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన పదార్థాలని అన్నారు. కొందరు స్నేహితుల ఒత్తిడి, ఆసక్తి లేదా తాత్కాలిక ఆనందం కోసం వీటిని ప్రయత్నిస్తారు. కానీ ఒక్కసారి అలవాటు పడితే దాని నుంచి బయటపడటం చాలా కష్టమని, సూచించారు. అలాగే మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. చదువుపై ఆసక్తి తగ్గి, విద్యలో వెనుకబడే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులకు మానసిక, ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. నేరాలకు పాల్పడే ప్రమాదం పెరుగుతుంది. జీవిత లక్ష్యాలు, భవిష్యత్తు అవకాశాలు దెబ్బతింటాయి.

**విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ఎవరైనా మాదకద్రవ్యాలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తే ధైర్యంగా "వద్దు" అని చెప్పాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో వెంటనే మాట్లాడాలి. క్రీడలు, యోగా, పుస్తక పఠనం, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ మాదకద్రవ్యాల విక్రయం గురించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి. పిల్లలపై ఎలాంటి హింస, వివక్ష లేదా నిర్లక్ష్యం చేయరాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పిల్లల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉందనీ తెలిపారు. బాల్య వివాహాల నిషేధం గురించి మాట్లాడుతూ, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండకముందు వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల చదువుకు అంతరాయం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తూ, 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం చట్టవిరుద్ధమని, బాల కార్మిక వ్యవస్థ పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. పిల్లలకు సంబంధించిన సమస్యలు లేదా అత్యవసర పరిస్థితుల్లో 1098కు సమాచారం ఇవ్వవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. పోక్సో, చైల్డ్ లేబర్, డ్రగ్స్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై యాదయ్య, పాఠశాల ఎంఈవో , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బాలల పరిరక్షణ విభాగానికి చెందిన హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

**- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వారం ప్రజావాణికి 70 ఫిర్యాదులు అందాయని తెలిపారు. గత కొద్ది వారాలుగా వచ్చిన ప్రజావాణి అర్జీల పరిష్కారంలో కొంత పురోగతి కనిపిస్తున్నప్పటికీ, ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రజావాణితో పాటు సీఎం ప్రజావాణికి వచ్చే అర్జీలను కూడా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలను సంబంధిత మండలాల రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో చాలామంది ప్రజలు అదే సమస్యలతో మళ్లీ ప్రజావాణికి వస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రతి బుధవారం ఆయా శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి, తమ శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకార్మిక సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

- 2026-2027 ఏడాదికిగాను రూ.116 కోట్లు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం
- దేవరకద్ర నియోజకవర్గ మత్స్య శాఖ అధ్యక్షులు తెలుగు వెంకటేష్ ముదిరాజ్



**దేవరకద్ర, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర శాసన సభ్యులు జీఎమ్ఆర్ చొరవ మంత్రి వాకిటి శ్రీహరి కృషితో ఉచిత చేపపిల్లల పంపిణీ నిధులు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం. ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం 2026-2027 ఏడాదికిగాను రూ.116 కోట్లు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం. మంత్రి వాకిటి శ్రీహరి కృషితో నిధులు మంజూరుకావడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకార సహకార సంఘాలు, మత్స్యకారులు.మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో రాష్ట్రంలో ఉన్న లక్షలమందికిపైగా మత్స్యకారులకు ఉపాధి చేకూరుతుందంటున్న దేవరకద్ర నియోజకవర్గ మత్స్య కారుల తరుపున గౌరవ రాష్ట్ర మత్స్య శాఖామంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి, దేవరకద్ర శాసనసభ్యులు జీఎమ్ఆర్ కి ధన్యవాదాలు తెలిపిన దేవరకద్ర నియోజకవర్గ మత్స్య శాఖ అధ్యక్షులు తెలుగు వెంకటేష్ ముదిరాజ్.

# నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్..

**- బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తుల ఆహ్వానం**

**గద్వాల, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాలలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు గల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ ఫౌండేషన్ కోర్సులో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్‌తో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు వివరించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ప్రతి నెల రూ.1,000 బుక్ ఫండ్, రవాణా భత్యం రూపంలో స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థులకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశమని, అర్హులైన నిరుద్యోగ యువత నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ రాములు కోరారు. మరిన్ని వివరాలకు 08546-293022, 99085 60268 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# పేదింటి బిడ్డలకు అండగా మంత్రి పొంగులేటి

- పాలేరు ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ
- బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం



**పాలేరు, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** పేదింటి బిడ్డల కష్ట,నష్టాల్లో ఆదుకుని అండగా నిలబడటంలో తెలంగాణ రాష్ట్ర, రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముందువరుసలో ఉంటారని పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ అన్నారు.తిరుమలాయపాలెం మండలంలోని బాలాజీనగర్ తండా, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, మేకలతండా, మేడిదపల్లి, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా, రఘునాథ పాలెం, కాకరవాయి, జూపెడ, రాజారం, బచ్చోడుతండా, బచ్చోడు,బీరోలు, ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, ఎర్రగడ్డలో ఇటీవల మరణించిన 60 కుటుంబాలను పరామర్శించి,మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి పదివేల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్,మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, నాయకులు గోళ్ల లింగయ్య,ధరావత్ నరసింహారావు,ఉప్పునూతల నాగేశ్వరావు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**కూసుమంచిలో శ్రీనన్న ఆత్మీయ భరోసా..!**

కూసుమంచి మండలంలోని నేలపట్ల,లోక్య తండా,గంగబంద తండ,గట్టుసింగారం,మల్లేపల్లి, పెరికసింగారం,హిరామన్ తండ,నాయకన్ గూడెం,పాలేరు,సంధ్య తండ, గైగోళ్లపల్లి, పోచారం, ముత్యాల గూడెం,కేశవాపురం, తురకగూడెం,కూసుమంచి గ్రామాలలో వివిధ కారణాలతో మరణించిన 44 కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొంగులేటి శ్రీనన్న ఆత్మీయ భరోసా..ప్రతి పేద కుటుంబ నమ్మకానికి ప్రతిక అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి,నాయకులు మంకెన వాసు,జొన్నలగడ్డ రవి,మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు,కంచర్ల జీవన్ రెడ్డి,చాట్ల పరుశురాం,కొర్ర రమేష్, కొత్త పుల్లారెడ్డి, సర్పంచ్ లు వడిత్య వెంకటేష్ నాయక్, బాదావత్ నరేష్,పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐదో వార్డులో ఉచిత ఆరోగ్య శిబిరం

## -ప్రారంభించిన ఐదవ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి

**వైరా, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**



వైరా మున్సిపాలిటీ పరిధి లోని 5వ వార్డులో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పాల్గొన్నారు. డాక్టర్ సాయి నిఖిత శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సూచనలు, జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని అన్నారు. జ్వరం, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్లు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు చికిత్స పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత కుమారి, అంగనవాడి టీచర్ శ్రీదేవి ,ఆశా వర్కర్ రేణుక ,ప్రమీళ, మహేశ్వరి, ఆయా రేణుక తదితరులు పాల్గొన్నారు

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

## : కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి



**వైరా, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైరా మున్సిపాలిటీ 5వ వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ ప్రతి శిశువుకు తల్లిపాలే ఉత్తమ ఆహారమని పేర్కొన్నారు.శిశువు పుట్టిన తొలి గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పరిపూరక ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.తల్లిపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడటమే కాకుండా, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయనిచెప్పారు.తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, ప్రతి కుటుంబం శిశు ఆరోగ్య పరిరక్షణలో తమ బాధ్యతను గుర్తించి తల్లిపాల ప్రాముఖ్యతనుప్రోత్సహించాలని కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి నికిత, ఏఎన్ఎం లలితా కూమారి , అంగన్వాడి శ్రీదేవి, ,అంశ వర్కర్ రేణుకా,ప్రమిళ , మహేశ్వరి, రేణుకా తదితరులు పాల్గొన్నారు

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బాల గ్రామ సభ నిర్వహణ



**నిజామాబాద్, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

నందిపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల గ్రామ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రధాన సమస్యలైన తాగునీటి సౌకర్యం,మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం దృష్టికి తీసుకువచ్చారు.విద్యార్థులు తెలిపిన సమస్యలను సర్పంచ్ నోట్ చేసుకుని,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల,ఉప సర్పంచ్ చందర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్,వార్డు సభ్యులు పాషా,పెట్ల శ్రీనివాస్,చింత శ్రీనివాస్,కంఠం చిన్నయ్య,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వేణుకుమార్ కుటుంబానికి నామ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం

- దయచేసి నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు : మాజీ ఎంపీ నామ విజ్ఞప్తి
- బాధిత కుటుంబాన్ని ఆదుకున్న మాజీ ఎంపీ నామను అభినందించిన యువత



**ఖమ్మం, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు జీ. వేణుకుమార్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆస్పత్రికి వెళ్లి వేణుకుమార్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన విషయం తెలిసిందే. పరామర్శ సందర్భంగా వేణుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నామ చలించిపోయి తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల రూపాయలు సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం వేణుకుమార్ నాయనమ్మకు ధైర్యం చెబుతూ "నేను అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చిన నామ, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పరామర్శించిన మరుసటి రోజే ఆర్థిక సాయం అందించడం విశేషం. క్లిష్ట సమయంలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని నామ పేర్కొన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి వెంటనే ఆర్థిక సహాయం అందించిన నామకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు.

**వేణుకుమార్ ఒక్కడి సమస్య కాదు, లక్షలాది నిరుద్యోగుల ఆవేదన : కమల్‌రాజు**

ఈ సందర్భంగా కమల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తోందని విమర్శించారు. 31 నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. వేణుకుమార్ ఆత్మహత్యాయత్నం నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని, నిరుద్యోగులు పడుతున్న వేదనకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేణుకుమార్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు వారి నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వేణుకుమార్ కోలుకున్న అనంతరం అతనికి అవసరమైన కోచింగ్‌తో పాటు ఇతర అవసరాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే గ్రూప్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం వేణుకుమార్ ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గడ్డం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ యువజన నాయకులు రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- ఆగస్టు 8లోగా అన్ని శాఖలు నివేదికలను డీపీఆర్వోకు అందజేయాలి
- ప్రతి శాఖ నుంచి ఉద్యోగుల పేర్లను ప్రశంసాపత్రాలకు ప్రతిపాదించాలి
- మినిట్ టు మినిట్ వారీగా కార్యక్రమాన్ని ముందుగానే ఖరారు చేయాలి
- స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రసంగాన్ని ఆగస్టు 11 నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతి శాఖ తమ శాఖలో చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షిప్తంగా పొందుపరిచిన నివేదికలను ఆగస్టు 8 లోగా డీపీఆర్వోకి అందజేయాలని ఆదేశించారు. సౌండ్ వ్యవస్థ ఏర్పాట్ల బాధ్యతను ఖమ్మం అర్బన్ తహసీల్దార్ చేపట్టాలని, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లను డీపీఆర్వో ముందస్తుగా పరిశీలించి నిర్ధారించాలని సూచించారు.ప్రతి శాఖ నుంచి ప్రశంసా పత్రాల కోసం ఇద్దరు ఉద్యోగుల పేర్లను మాత్రమే ప్రతిపాదించాలని, వారి సేవా చరిత్ర మంచిగా ఉండాలని స్పష్టం చేశారు. వేదికపై జరిగే ప్రతి కార్యక్రమాన్ని మినిట్ టు మినిట్ వారీగా కార్యక్రమ పట్టికలో పొందుపరిచి ముందుగానే ఖరారు చేయాలని, కార్యక్రమ వ్యాఖ్యాతకు పూర్తి కార్యక్రమంపై ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్య అతిథి రాకముందే అందరూ తమ స్థానాల్లో కూర్చునేలా చూడాలని ఆదేశించారు. స్టాల్స్‌ను ఆగస్టు 15 ఉదయం 6 గంటలకల్లా సిద్ధం చేయాలని,సాంస్కృతిక కార్యక్రమాల్లో వినిపించే పాటలను ముందుగానే ఎంపిక చేసి ఒక్కో పాట మూడు నుంచి నాలుగు నిమిషాలకు మించకుండా చూడాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తాజా నివేదికలతో వేడుకలకు హాజరు కావాలని తెలిపారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆహ్వానితులకు ప్రోటోకాల్ ప్రకారం జిల్లా రెవెన్యూ అధికారి ద్వారా ఆహ్వానాలు పంపించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం మైదానం సిద్ధం చేయాలని, టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు తదితర ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.వ్యవసాయం, అనుబంధ శాఖలు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, ఉద్యాన, పశు సంవర్ధక, తదితర శాఖలు అభివృద్ధి ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అవసరమైన ఏర్పాట్లను తహసీల్దార్ చేపట్టాలని సూచించారు.ప్రశంసా పత్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆగస్టు 12 లోగా పంపించాలని, అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణి లో 30 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**




నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐ,సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేశారు.ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ,వారి వారి సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకునేలా,పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.ప్రజా సమస్యల పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని ఆయన అన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలి..

- జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్..



**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతిష్టా త్మకంగాజరిగేప్రజాసమస్యల పరిష్కారవేదికపిజిఆర్★ ఎస్ ద్వారా బాధి తులకు భరోసా కల్పించే విధంగా ఆయా శాఖలజిల్లా" అధికారు లు వ్యక్తిగతంగా అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) రెవెన్యూ క్లినిక్ కార్యక్ర మాలకుసంబంధించిన అర్జీలను ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డిఆర్ఓ మా లోలా,ఎస్ డి సి లు రామ్మోహన్, కిరణ్మయి, మల్లికార్జున్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతోనిర్మాత్మక చర్యలు తీసుకొని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి శాఖ పరమైన చర్యలు తీసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరి ష్కరించాలనిఆదేశించారు. ముఖ్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రతి దరఖాస్తును నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిం చాలన్నారు. అలాగే అర్జీలకు ఎండాస్మెంట్ చేసి సంబంధిత శాఖల వివరాలు స్పష్టంగా ఇవ్వాలన్నారు. పిజిఆర్ఎస్పై క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ నిష్క్రమణ ప్రాంతాలలో క్యూఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సేవను మరింతగా సంతృప్తికరంగా ప్రజా సమస్యలను వేగంగా పారదర్శకంగా నిబంధనల మేరకు పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించే అర్జీలనుఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ,అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారిపై విచారణ చేసి తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పి జి ఆర్ ఎస్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఈ అంశంలో ఆయా డివిజన్ స్థాయి అధికారులు కూడా ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తర ములను తప్పనిసరిగా ఈ-ఆఫీస్ విధానంలో కొనసాగించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలతో మొత్తం 699 అర్జీలు రాగా ఇందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి286 వరకు అర్జీలు వచ్చాయి.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

### - ఏ ఒక్క ఓటు వృధా కాకూడదు బిజెపి నేతల పిలుపు

**తాడేపల్లి గూడెం, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**



స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి నేతలు కార్యకర్తలు సన్నద్ధం కావాలని, ఓటర్ల జాబితాలో అర్హులైన వారే ఏ ఒక్క ఓటు వృధా కాకుండా జాగ్రత్త వహించాలని బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ కార్యాలయంలో సోమవారం జరిగిన నెలవారి సమావేశానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బిజెపి జిల్లా ఇన్చార్జి రేలంగి శ్రీదేవి మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్, పంచాయతీ స్థానిక సంస్థలు ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా ఓటర్ల జాబితాలో సమగ్ర సవరణ నమోదు కార్యక్రమం రెండో దశలో ముసాయిదా ఓటర్ల జాబితాలను పరిశీలించి అర్హులైన వారి పేర్లను పరిశీలించి, లేకుంటే వాటిని తిరిగి నమోదు చేసేలా కృషి చేయాలని కోరారు. బిజెపి నాయకులు కార్యకర్తలు సమైక్యంగా కృషిచేసి మరింత బలోపేతం చేయాలన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ సంస్థాపరంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాలతో ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన వారి ఓట్లు గల్లంత కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. చనిపోయిన వారు స్థానికంగా నివాసం లేనివారే పేర్లు జాబితాలో ఉంటే అభ్యంతరం తెలుపుతూ వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకొనేల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. శక్తి కేంద్రాల ఇన్చార్జిల నియామకాలు సత్వరం పూర్తిచేసి బూత్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దృష్టి తీసుకువెళ్లాలని కోరారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్, శక్తి కేంద్రాలు స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు సమన్వయంగా కృషి చేయాలని సూచించారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియ చెప్పాలని కోరారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, గట్టిం మాణిక్యాలరావు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి, కసిరెడ్డి నాగదుర్గ, మహిళమోర్చ పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి నా గదుర్గ,రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్,బి ఎల్ ఏ-1 పాటే నాగేశ్వర రావు, ముప్పిడి సురేష్ రెడ్డి,ఎస్విరంగారావు,పదాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత, సంక్షేమం, నాణ్యమైన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**గుడివాడ, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**



పిల్లల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వి. గాంధీ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం గుడివాడ డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఎంపీయూపీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను ఆయన విస్తృతంగా సందర్శించారు. గుడ్లవల్లేరు, కౌతవరం, నందివాడ, బేతవోలు తదితర ప్రాంతాల్లోని విద్యాసంస్థలను పరిశీలించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, భద్రతా చర్యలు, పరిశుభ్రత, హాజరు నమోదు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన వి. గాంధీ బాబు వారి చదువులు, ఆరోగ్యం, హాస్టల్ సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం,ఉపాధ్యాయుల బోధన, ఇతర సమస్యల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. పిల్లల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ, వారి విద్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని, హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, తాగునీరు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. పిల్లల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి కిషోర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మధుబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నాగరాజు, సంబంధిత సీడీపీవోలు, సూపర్వైజర్లు, రెవెన్యూ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్మాత సన్నిధిలో కొనసాగుతున్న మహిళా భక్తుల రద్దీ



**విజయవాడ, ఆగస్టు 4 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి పై ఆషాఢ సారె 20వ రోజు సోమవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళా భక్తుల రద్దీ విశేషంగా పెరిగింది.- సాయంత్రం 5 గంటల వరకు 48 సారె బృందాలు రాగా 18432 మంది భక్తులు సారె ను సమర్పించారు. సారె బృందాలకు ఉచిత దర్శనం, వేద పండితులు వేదాశీర్వచనం అందజేసారు.

## తల్లిపాలే తొలి టీకా.. శిశువుకు సంపూర్ణ రక్షణ



**పులిచెర్ల, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పులిచెర్ల మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం అత్యంత అవసరమని తెలిపారు. తొలి పాలు శిశువుకు తొలి టీకా వంటివని, వాటిలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని చెప్పారు. శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని, బాలింతలు పోషకాహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు సుగుణ, శివరాణి, అంగన్వాడీ కార్యకర్త ముబీనతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి

- నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేయాలి : జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం, ఆగస్టు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** నీటి లభ్యతపై అనిశ్చిత పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని, ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి రైతులను ఉద్దేశించి వీడియో సందేశం విడుదల చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కాలువల ద్వారా నీటి సరఫరా కూడా పరిమితంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రబీ పంటల సాగుపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దిగుబడి తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది పంట బీమా అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పంట బీమా చేయించుకోవడం ద్వారా నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందవచ్చని చెప్పారు.పంట రుణాలు తీసుకునే రైతులు సంబంధిత బ్యాంకుల ద్వారా, ఇతర రైతులు గ్రామ, వార్డు సచివాలయాలు లేదా సహకార సంఘాల ద్వారా పంట బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని, తద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను ఎదుర్కొనే భరోసా పొందాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అంగన్వాడీలను సంతృప్తి స్థాయిలో నిర్వహించాలి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): అంగన్వాడీలను సంతృప్త స్థాయిలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా స్థాయి సమీక్షసమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ లో ఎల్లప్పుడూ సానుకూల స్పందన పొందేవిధంగా ఎప్పుడూ పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా తనిఖీ చేయాలని సీడీపిఓ లను, పర్యవేక్షకులను ఆదేశించారు. శాఖకు సంబంధించిన అన్ని నివేదికల్లో – ప్రీస్కూల్ అటెండెన్స్, ఆపార్ ఐడి క్రియేషన్, లబ్ధిదారుని అభా ఐడి క్రియేషన్, టేక్ హోమ్ రేషన్ పంపిణీ, పాన్ కుడి, ఏ.ఐ.ఇ.సి.డి స్క్రీనింగ్, గ్రోత్ మానిటరింగ్, పి.ఎం.ఎం.వి.వై, సరుకుల నమోదు తదితర శాఖా పరమైన సూచీలకు అనుగుణంగా ఖచ్చితమైన, నాణ్యమైన డేటాను నమోదు చేసి, లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని అన్నారు.
ఈ సమావేశంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పి.జి. ప్రసూన, సి.డి.పి.ఓ లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## కోడి పందాలపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడి



○ రెండు పుంజులు, నాలుగు బైక్‌లు స్వాధీనం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడి పందాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. వీఐపీ రోడ్‌లోని కావేరినగర్ 3వ లైన్‌లో ఖాళీ స్థలంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. పోలీసులు వస్తున్నట్లు గమనించిన నిర్వాహకులు, పందాల్లో పాల్గొన్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటన స్థలంలో రెండు పందెం పుంజులు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.
కోడి పందాలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా పోలీసులు హెచ్చరించారు.

## వైభవంగా వాసవి అమ్మవారికి శాకాంబరీ దేవి అలంకారం



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండలంలో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానము నందు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రెసిడెంట్ అయ్యపు వెంకట సురేష్‌బాబు వారి కమిటీ సభ్యులు మరియు మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా వాసవి అమ్మవారికి అన్ని రకాల కూరగాయలతో ఆకుకూరలతో అత్యంత వైభవోపేతంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళా మణులతో కుంకుమార్చన మధ్యాహ్నం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించడం జరిగింది. అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసారు. ఈ పవిత్రమైన శాఖంబరిదేవి అలంకార దర్శనం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు పుష్కలంగా పండాలని ప్రతి ఇంటా సుఖశాంతులు ఆరోగ్యం ఐశ్వర్యం సుభిక్షం నెలకోవాలని అమ్మవారిని అలంకరిస్తారు.

**దర్శనానికి విచ్చేసిన వివిధ ప్రముఖులు**

జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి వారు అచలానంద స్వామి ఆశ్రమం పీఠాధిపతులు విరిజానంద స్వాములవారు టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్ సాంబశివరెడ్డి మండల సీనియర్ నాయకులు ఎస్ఆర్ శ్రీనివాసులురెడ్డి మరియు పలు పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే అరెస్టు చేయరా ? : ఎమ్మెల్యే నసీర్

○ ఒక వైపు రైతులను కిడ్నాప్ చేసిన వారికి జగన్ మద్దతు
○ మరో వైపు అన్నదాతలకు పరామర్శలు
○ జగన్ నీచపు ఆలోచనలు ప్రజలు గమనిస్తున్నారు
○ మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు చట్టంపై గౌరవం ఉంటే పారిపోవడం ఎందుకు
○ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ అరాచకాలను ఎందుకు అడ్డుకోలేదు ?
○ చట్టం తన పని తాను చేసుకుపోతుంది
○ మన ఇంటికి- మన నసీర్ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):'ఒకవైపు రైతులను కిడ్నాప్‌లు చేసిన వారిని వెనకేసుకొస్తూ.. మరో వైపు అన్నదాతలను పరామర్శల పేరిట మోసగించడం ఎంత వరకు సమంజసం జగన్ ? మీ పార్టీ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా నిజాయితీపరుడని డబ్బాలు కొడుతున్నారు.. మరి చట్టాలను గౌరవించకుండా ఇష్టమొచ్చినరీతిన ఎలా వ్యవహరించారు ? అధికారంలో ఉన్నప్పుడు తన సోదరుని అరాచకాలను ఎందుకు నిలువరించలేదు. ముస్తఫా కుటుంబం ఆగడాలను నియోజకవర్గ ప్రజలందరూ చూస్తూనే ఉన్నారు. చట్టాన్ని అమలు చేస్తోన్న పోలీసులపై ఆరోపణలు చేయడమేంటి ? చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మంగళవారం మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమాన్ని స్థానిక డివిజన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇంట్లో ఎవరికి సంక్షేమ పథకాలు అందాయో ? ఇంకా ఎవరైనా అర్హులకు అందకుండా మిగిలిందా ? వంటి అంశాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ పథకాలు చేరువ చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని ప్రాంతాలను సర్వనాశనం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలకు కొమ్ముకాశారని విమర్శించారు. ఇప్పుడు తప్పులు చేసి కూడా బుకాయిస్తున్నారని, అసలు తప్పు చేయనప్పుడు పారిపోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కిడ్నాపర్లు, రౌడీలకే జగన్ కొమ్ముకాస్తారని, ప్రజల అవసరాలు మాత్రం గాలికొదిలేస్తారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై అక్రమ కేసులు పెట్టారని గగ్గోలు పెడుతున్నారని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సొంత బాబాయి హత్యను నరకాసురవధ పేరిట దొంగ ప్రచారాలు చేశారని, ఇప్పుడు నియోజకవర్గంలోనూ ఇదే తరహాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి, సంక్షేమమని స్పష్టం చేశారు. మన్నవ మోహన్ కృష్ణ, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, దాసరి రాజా మాస్టర్, కన్న, పుట్టా దుర్గ, విజయలక్ష్మి, బొల్లా శ్రీను, పవన్, అబ్దుల్లా, జానీ, గఫార్, వెంకటేష్ ఎంపరాల శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో మండలి ఆదర్శం స్ఫూర్తిదాయకం : ఎస్పీ వకుల్ జిందాల్

○ మండలి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా ఘన నివాళి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):మాజీ మంత్రి, ప్రముఖ రాజకీయవేత్త స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో మండలి వెంకటకృష్ణారావు చెరగని ముద్ర వేసిన నాయకుడని పేర్కొన్నారు. ప్రజాసేవను జీవిత లక్ష్యంగా తీసుకుని సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆయన నిరాడంబర జీవనం, సేవా దృక్పథం నేటికీ ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దివిసీమ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసి గ్రామీణాభివృద్ధి, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, పేదల సంక్షేమానికి విశేష ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. 1977లో దివిసీమ ఉప్పెన సమయంలో బాధితులకు సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించి వేలాది మందికి అండగా నిలిచారని గుర్తు చేశారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతికి ఆయన విశేష సేవలందించారని, 1975లో ప్రపంచ తెలుగు మహాసభల విజయవంతమైన నిర్వహణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో విద్య, సాంస్కృతిక వ్యవహారాలు, పునరావాస శాఖల మంత్రిగా ప్రజాకేంద్రీకృత నిర్ణయాలతో విశిష్ట సేవలందించారని తెలిపారు.
మండలి వెంకటకృష్ణారావు ఆశయాలు, సేవలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లికార్జునతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శనివారంలోపు ప్రధాన డ్రైన్లలో రెండో విడత పూడికతీత పూర్తి చేయాలి

○ ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగరంలోని ప్రధాన డ్రైన్లలో రెండో విడత పూడికతీత పనులను శనివారంలోపు పూర్తి చేయాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
పూడికతీత పనుల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లదేనని, ఒప్పందంలో 90 రోజుల నిర్వహణ నిబంధన ఉన్నందున వారితోనే రెండో విడత పనులు పూర్తిచేయించాలని కమిషనర్ స్పష్టం చేశారు. కల్వర్టుల వద్ద సిల్ట్ తొలగింపు సరిగా జరగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాలువల నుంచి తొలగించిన పూడికను వెంటనే తరలించాలని ఆదేశించారు.
నగరంలోని గుంతలను వచ్చే వారం రోజుల్లో పూర్తిగా పూడ్చాలని, ఎక్కడా పాట్‌హోల్స్ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పనుల నాణ్యతను నిర్ధారించాలని సూచించారు.
తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడా కలుషిత నీరు సరఫరా కాకుండా ఈఎల్ఎస్ఆర్‌లలో, గృహాల వద్ద తప్పనిసరిగా నీటి నమూనాలు సేకరించాలని ఆదేశించారు. ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను నిర్దేశిత వ్యవధిలో శుభ్రపరుస్తూ ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని చెప్పారు. వాటర్ మీటర్ రీడింగ్‌ను క్రమం తప్పకుండా నమోదు చేసి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులను రద్దు చేయాలని కమిషనర్ ఆదేశించారు. పార్కుల అభివృద్ధితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు.
నగరంలో వంద శాతం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించి, సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.
సమావేశంలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందరరామిరెడ్డి, ఈఈ విష్ణుమూర్తి, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వికసిత్ భారత్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బీజేపీ జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, బీజేపీ యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతం



○ డాక్టర్ సుభాష్ రమాదేవి

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి అన్నారు.స్థానిక పద్మశాలి పేట లోనీ ఆరోగ్య కేంద్రం లో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ రమాదేవి మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తల్లిపాల యొక్క ఆవశ్యకతను వివరించాలనీ ఆమె అన్నారు. తల్లిపాలు బిడ్డకు సహజ సిద్ధమైన ఆహారమనియు,బిడ్డకు కాన్పు అయిన అరగంటలోపు తల్లిపాలుపట్టించాలన్నారు. తల్లిపాలలో ఏడు రకాలైన కార్బో హైడ్రేట్స్, ప్రోటీన్స్, కొవ్వు పదార్థాలు ,విటమిన్లు, మినరల్స్, ఫైబర్ ,నీరు, వంటి పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్ధములు కలవనియు, ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఆమె తెలిపారు. బిడ్డ తల్లిని ఆలింగనం చేసుకొనుటవలన తల్లి బిడ్డకు అన్యోన్యత,ఆప్యాయత, అనురాగము పెరుగునని అన్నారు. తల్లిపాలు 24 గంటలు అందుబాటులో ఉండుననియు, క్రిమిరహితముగా,సమ ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉండి తేలికగా జీర్ణమవుతాయని ఆమె పేర్కొన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కీటక జనిత వ్యాధులనుండి అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తెలియజేయాలన్నారు . నీటి నిల్వలు ఉన్నచోట మడ్డి ఆయిల్ కానీ ,వాడిన వంట నూనెను కానీ పిచికారి చేసినట్లయితే దోమల వృద్ధిని అరికట్టవచ్చుని ఆయన తెలిపారు. సమావేశంలో హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత ,మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, డిఈఓ శ్రీదేవి, ఆశా కార్యకర్తలు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

○ 18 ఎఫ్ఐఆర్‌లు, 116 పెట్టి కేసులు నమోదు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో 18 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 116 పెట్టి కేసులు నమోదు చేశారు.
ముఖ్య కూడళ్లు, వైన్ షాపుల పరిసరాలు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారికి బహిరంగంగా మద్యం సేవించడం నేరమని, దీనివల్ల శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.
జిల్లాలో మహిళలు, చిన్నారులు భయాందోళనలు లేకుండా సంచరించే వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వైన్ షాపుల యజమానులు తమ దుకాణాల వద్ద లేదా పరిసరాల్లో బహిరంగంగా మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.
బహిరంగంగా మద్యం సేవించడం, గొడవలు చేయడం లేదా మహిళలకు ఇబ్బందులు కలిగించే ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100, 112 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రతి డివిజన్‌లో రూ.10 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 33వ డివిజన్ లో రూ.1.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని, ప్రతి డివిజన్‌లో రూ.10 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం 33వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు.
ఈ సందర్భంగా 33వ డివిజన్ బ్రాడిపేట 2/17లోని బండ్లమూడి హనుమాయమ్మ కళాశాల సమీపంలో రూ.77 లక్షల వ్యయంతో 2/17 నుంచి 2/19 వరకు సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే లక్ష్మీపురం 1వ లైన్ నుంచి పండరిపురం అడ్డరోడ్డు వరకు రూ.42.80 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ఆర్సీసీ కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.1.19 కోట్ల (రూ.119.80 లక్షలు) విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని,గత పదేళ్లలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు సరైన స్థాయిలో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.
గత పాలకులు ప్రజల అవసరాలను కాకుండా రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొంతమంది వర్గాలకే పరిమితమై అభివృద్ధి పనులు చేపట్టారని విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలందరినీ సమానంగా చూస్తూ ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నామని తెలిపారు.
33వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందించామని, నేడు మరో రూ.1.19 కోట్ల పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. అదనంగా రూ.3 కోట్లకు పైగా పనులు అంచనాల దశ పూర్తి చేసుకుని టెండర్ల కోసం సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఈ రెండు సంవత్సరాల కాలంలోనే ప్రతి డివిజన్‌లో రూ.10 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని పేర్కొన్నారు.
ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కూటమి నాయకులు, ప్రజలు కలిసి ముందుకు సాగుతున్నారని, ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పోపురి నరేంద్ర, చింతకాయల శివ, వెంకటేష్ యాదవ్, నారాయణ రెడ్డి, గాయత్రి బెహరా, నాగరాజు, గోపి, బైరి కళ్యాణ్,ఉప్పుటూరి పేరయ్య,లక్ష్మి, ద్వారా పుల్లమ్మ,గుర్రం మల్లీశ్వరి,నిమ్మల ప్రశాంత్, కుంటా గోపి,దొంతి చంద్ర శేఖర్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశాలతో ఆరోగ్య సంరక్షణ పనులే చేయించాలి

- ఇతర పనులు అప్పగించవద్దని వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశం
- మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు మారేడుమిల్లి పీహెచ్‌సీ ఘటనపై విచారణ
- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని పోలవరం జిల్లా అధికారికి ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆశా కార్యకర్తలతో ఆరోగ్యానికి సంబంధించిన పనులు మాత్రమే చేయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ఆసుపత్రుల్లో శుభ్రత పనులు, ఇతర సంబంధం లేని పనులను వారికి అప్పగించవద్దని అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ మరోమారు అధికారులకు స్పష్టం చేసింది. 2024లో ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. పోలవరం జిల్లాలోని మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో శుభ్రత పనులు చేయిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో కొన్ని చిత్రాలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిపై స్పందించి మంత్రి సత్య కుమార్ జారీ చేసిన ఆదేశాల మేరకు పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని విచారణ జరపాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆశా కార్యకర్తలకు శుభ్రత పనులు ఎవరు అప్పగించారు, ఏ పరిస్థితుల్లో ఆ పనులు చేయించారు, గతంలో ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు కాలేదనే విషయాలను విచారణలో తేల్చాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పూర్తిస్థాయి నివేదికను మూడు రోజుల్లోగా రాష్ట్ర కార్యాలయానికి పంపాలని పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి స్పష్టం చేశారు.

## బీజేపీలో చేరిన స్మార్ట్‌చెక్ అధినేత శ్రీనివాస్ తేజ మాదల



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్‌చెక్ అధినేత శ్రీనివాస్ తేజ మాదల (డైమండ్ తేజ) భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, టీటీడీ పాలక మండలి సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ సమక్షంలో ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు యువకులు, స్నేహితులు కూడా బీజేపీలో చేరారు. శ్రీనివాస్ తేజ మాట్లాడుతూ, దేశాభివృద్ధి, జాతీయవాద భావజాలం, యువత సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్న భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు. దేశ నిర్మాణంలో యువత మరింత బాధ్యతతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి, సేవ, సుశాసనం లక్ష్యాల సాధనకు పార్టీ కార్యకర్తగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారిని అభినందించారు.


## పేదల వైద్య భరోసాకు ప్రజా ప్రభుత్వం అండ : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు తన కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు రూ. 36,91,588 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్స భారంగా మారకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా వేగవంతంగా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందేలా ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మొత్తం 2,038 మంది లబ్ధిదారులకు రూ. 13,76,07,152 సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైందని, ఒక్కరోజులోనే 60 మందికి రూ. 36.91 లక్షల విలువైన చెక్కులు అందజేయడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని జీవీ అంజనేయులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆయుష్ విభాగాలకు స్థల పరిశీలన చేసిన సి.సి.ఆర్.వై.ఎన్ బృందం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు ఏర్పాటుకు ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పరిధిలో స్థల పరిశీలన జరిగింది. కేంద్ర యోగ మరియు ప్రకృతి వైద్య పరిశోధన మండలి సంచాలకులు డా. జ్యోతి కేశ్వాణి , ఆయుష్ మంత్రిత్వ శాఖ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ – కన్సల్టెంట్ ప్రమోద్ వర్మ, పరిశోధన అధికారి డా. ఎన్. వి. జ్ఞన దీప్ తటావర్తి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ వివరాలు తెలిపారు. గుంటూరు పట్టణానికి అతి సమీపంలో ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు రావడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

# ‘ఎన్టీఆర్ వైద్య సేవ’పై తప్పుడు ప్రచారం తగదు

- మంత్రులు సత్యకుమార్ యాదవ్, పార్థసారథి



**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్):** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ (పూర్వం ఆరోగ్యశ్రీ) పథకంపై వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండలో రూ. 1.95 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ల్యాబ్ భవనాలకు మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పేరు మాత్రమే మారిందని, పేదలకు వైద్యసేవలు ఎక్కడా ఆగలేదని స్పష్టం చేశారు.

వైకాపా ఐదేళ్ల పాలనలో 41 లక్షల మందికి వైద్యసేవలు అందగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 29 లక్షల మందికి ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా చికిత్స అందించిందని తెలిపారు. రెండేళ్లలో రూ. 8,400 కోట్ల విలువైన చికిత్సలు అందించగా, ఆసుపత్రులకు రూ. 7,000 కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. లబ్ధిదారులు, చికిత్సలు, చెల్లింపులు పెరిగినా పథకంపై అసత్య ప్రచారం చేయడం రాజకీయ దురుద్దేశమేనని అన్నారు.

వైకాపా అధినేత జగన్ బాధిత కుటుంబాలను పరామర్శించకుండా నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి ఇళ్లకు వెళ్లడం వికృత రాజకీయ సంస్కృతికి నిదర్శనమని మంత్రి విమర్శించారు. ఎన్టీఆర్ వైద్య సేవపై సందేహాలుంటే గణాంకాలతో బహిరంగ చర్చకు సిద్ధమని, గతంలో విసిరిన సవాల్‌కు ఎవరూ స్పందించలేదని గుర్తు చేశారు.

చనుబండ పీహెచ్‌సీకి గత ప్రభుత్వం మూడుసార్లు ఉత్తర్వులు జారీ చేసినా నిధులు కేటాయించలేదని ఆరోపించిన మంత్రి, కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 1,200 కోట్లతో పనులు చేపట్టిందన్నారు. ‘సంజీవని’ మొబైల్ వైద్య సేవలు, ఆరోగ్య మందిరాల నిర్మాణం, వైద్యుల నియామకాలతో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

## పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన బీజేపీ జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను భారతీయ జనతా పార్టీ జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఈ సందర్భంగా శివ ప్రకాష్ అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

ఈ భేటీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి విజయ పరంపర కొనసాగిస్తాం: బీజేపీ రాష్ట్ర కమిటీ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఎన్నికల విజయ పరంపరను కొనసాగిస్తూ కూటమికి ఘన విజయం సాధించేలా సమన్వయంతో పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ , రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సమావేశంలో పార్టీ జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసే విధానంపై స్పష్టత ఇచ్చారు.



అనంతరం అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక ఎన్నికల సన్నాహకాలు, కూటమి వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రాష్ట్ర అభివృద్ధికి మూడు ఎకనామిక్ కారిడార్లు కీలకంగా మారనున్నాయని, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి వీటి ద్వారా ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య స్థానాల పంపకంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే బీజేపీ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో ఉందన్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించేలా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

2024 ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహాన్ని స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని, స్థానిక పరిస్థితులు, పార్టీ బలం, కార్యకర్తల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేస్తామని చెప్పారు. కూటమిలోని ప్రతి పార్టీ పోటీ చేయగల ఆశావహులను గుర్తించే ప్రక్రియ చేపడుతుందని వివరించారు.

స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా, సమన్వయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర బాధ్యతలను ఎమ్మెల్యే నడికుడి ఈశ్వరరావు, గోదావరి ప్రాంత బాధ్యతలను తపన చౌదరి, కోస్తాంధ్ర బాధ్యతలను వల్లూరి జయప్రకాశ్ నారాయణ్, రాయలసీమ బాధ్యతలను ఎమ్మెల్యే పార్థసారథి నిర్వహిస్తారని, సమన్వయ బాధ్యతలను ఎమ్మెల్సీ సోము వీర్రాజు పర్యవేక్షిస్తారని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో నామినేషన్ దాఖలు చేయడానికే అవకాశం లేని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సి. ఆదినారాయణరెడ్డి, పార్థసారథి, నడికుడి ఈశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, సురేష్ రెడ్డి, ఆడారి ఆనంద్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మట్టా ప్రసాద్, వల్లూరి జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.

# వివక్షకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు చేరుస్తున్న కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న “ఇంటింటికి కూటమి ప్రభుత్వం – సంక్షేమ విజయాలు” కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్ పండరిపురంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గతంలో కనీసం ఇంటి ముందు సరైన రహదారి కూడా లేని ప్రాంతాల్లో నేడు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

గత ప్రభుత్వాల మాదిరిగా పార్టీలు, వర్గాలు, రాజకీయ అనుబంధాల ఆధారంగా కాకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ సమానమే అన్న సంకల్పంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎక్కడా వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ ప్రాంతాల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మెగా హెల్త్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

‘తల్లికి వందనం’, పెన్షన్ల పెంపు, దీపం వంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థిక భారం పెరిగినప్పటికీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి కార్యక్రమాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తున్నప్పుడు ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ, తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

రేషన్ పంపిణీ నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి వరకు ప్రతి విషయంలోనూ పారదర్శక విధానాన్ని అనుసరిస్తున్నామని, పార్టీతో సంబంధం లేకుండా ప్రజలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇదే కారణంగా అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని చెప్పారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతోందని ఎమ్మెల్యే తెలిపారు. స్వర్ణాంధ్ర–2047 లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని, రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఫిజియోథెరపీ విద్యలో నాణ్యతా ప్రమాణాల పెంపునకు సవరించిన పాఠ్యాంశం

- జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏకరీతిగా అమలు చేయాలి : డా. ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్ విశ్వ విద్యాలయ గౌరవ ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఫిజియోథెరపీ విద్యలో నాణ్యతా ప్రమాణాలను మరింత పెంపొందించడంతో పాటు, విద్యార్థులకు ఆధునిక వైద్య అవసరాలకు అనుగుణమైన విద్యను అందించడమే లక్ష్యంగా నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ , న్యూఢిల్లీ రూపొందించిన సవరించిన బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ పాఠ్యాంశాన్ని రాష్ట్రంలోని అన్ని అనుబంధ కళాశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డా. ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్) సూచించింది.

సవరించిన బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ పాఠ్యాంశంపై మంగళవారం విజయవాడలోని డా. ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన సవరించిన పాఠ్యాంశాన్ని అన్ని అనుబంధ ఫిజియోథెరపీ కళాశాలల్లో ఏకరీతిగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చన్నారు. విద్యార్థులకు ప్రస్తుత వైద్య రంగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం అందేలా పాఠ్యాంశాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ) కోర్సును ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయం తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఉపకులపతి తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ కోర్సు అందుబాటులోకి రావడం ద్వారా ఫిజియోథెరపీ విద్య మరింత విస్తరించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మాట్లాడుతూ, సవరించిన పాఠ్యాంశాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అన్ని అనుబంధ కళాశాలలు విశ్వవిద్యాలయంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠ్యాంశ అమలులో ఎదురయ్యే సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించుకోవాలని తెలిపారు.

కార్యక్రమంలో అదనపు డీఎంఈ (అకాడెమిక్) డా. వి. రాధికా రెడ్డి, డా. ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్ పరీక్షల నియంత్రణాధికారి డా. చి. శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ చైర్మన్ యలమంచిలి వెంకటేశ్వరరావు, కార్యదర్శి భీమ సుమిళ, పరిశోధన & అభివృద్ధి డైరెక్టర్ డా. ఎం. లక్ష్మీ సూర్యప్రభ, ప్రచురణల డైరెక్టర్ డా. కె. సుధ, జాయింట్ రిజిస్ట్రార్ (అకాడెమిక్) కె. నీలిమతో పాటు రాష్ట్రంలోని సుమారు 70 అనుబంధ ఫిజియోథెరపీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సవరించిన పాఠ్యాంశంలోని ముఖ్యమైన అంశాలు, బోధనా విధానాలు, ప్రాక్టికల్ శిక్షణ, పాఠ్యాంశ అమలు విధానం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పాఠ్యాంశాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన పలు సూచనలు, సలహాలను అధికారులు, నిపుణులు అందించారు. ఈ సందర్భంగా డా. వి. రాధికా రెడ్డి, యలమంచిలి వెంకటేశ్వరరావు, భీమ సుమిళలు సవరించిన పాఠ్యాంశం అమలుకు సంబంధించి తమ విలువైన సూచనలు అందించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అనుబంధ ఫిజియోథెరపీ కళాశాలల్లో సవరించిన పాఠ్యాంశాన్ని జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ప్రాక్టికల్ శిక్షణ అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467